నలుగురూ మరింతగా నవ్వకముందే తన విజిటింగ్ కార్డ్‌పై జస్ట్ పి. రవికిరణ్, ఫైనాన్స్ సెక్రటరీ అని వేసుకొని తన వెర్రిబాగుల తనాన్ని దూరం చేసుకున్నాడు.

లక్షల నష్టాన్ని కోట్ల లాభంగా మార్చే రియల్ లైవ్ జీనియస్ రాఘవేంద్ర నాయుడు, మూసిన కనురెప్పల వెనుక దాగిన తెలివితేటల ముందు తను అబ్సెషన్‌తో, గొప్పకోసం సాధించుకున్న డిగ్రీలు ఎందుకైనా పనికొస్తాయా అని అనిపించిన దగ్గర్నుంచే- యూనివర్శిటీల చదువుకన్నా, సిలబస్‌కన్నా, నిజజీవితపు వ్యాపార సూత్రాలే గొప్పవనిపించాయి.

పదిలక్షల ఖరీదుకూడా చేయని బార్‌ని మధుకర్ ముప్పయ్ లక్షలకు కొన్నప్పటినుంచి తను తీవ్రంగా మధనపడుతున్నాడు. దాన్ని లాభంగా ఎలా మార్చాలని యోచిస్తున్నాడు. అయినా తట్టలేదు. మరి తను చదివిన చదువుల మూలంగా తనకేం అబ్బినట్టు? ఐదో తరగతి వరకూ కూడా సరిగ్గా చదువుకోలేకపోయినా రాఘవేంద్ర నాయుడు దాన్ని లాభంగా మార్చగలరు ఎలా?

అదే డిగ్రీలు ఇవ్వలేనిది.

“బార్ ఒరిజినల్‌గా ఎంతుంటుంది?” వున్నట్లుండి అడిగాడు రాఘవేంద్ర నాయుడు.

“సరిగ్గా లెక్కవేస్తే ఎనిమిది లక్షలకంటే పలకదు సార్” సెక్రటరీ సమాధానమిచ్చాడు.

“ఏ సెంటర్‌లో వుంది?”

“క్రాఫోడ్ సెంటర్‌లో సార్!”

“ఎన్ని గజాలుంటుంది?”

“సుమారు ఆరువందల గజాలు.”

“ఆ స్థలం మీద ఎలాంటి వివాదాలు లేవుగా?”

"లేవు సార్!"

తిరిగి నిశ్శబ్దం అలుముకుంది ఆ హాల్లో.

ఆ నిశ్శబ్దం అలాగే కొద్దినిముషాలు రాజ్యమేలాక, నెమ్మదిగా లేచాడు రాఘవేంద్ర నాయుడు . ఆయన ముఖంమీద చిరునవ్వు లీలా మాత్రంగా మెరిసి అదృశ్యమైపోయింది.

"ఆ బార్ యజమాని ఎవరు?" కనురెప్పల్ని మృదువుగా రబ్ చేసుకుంటూ అడిగాడు రాఘవేంద్ర నాయుడు .

" రాజేంద్ర ప్రసాద్ అని ..... స్మాల్ టైప్ బిజినెస్‌మెన్ సార్" ఫైనాన్స్ సెక్రటరీ నెమ్మదిగా అన్నాడు.

"ఆ ప్రాంతాన్ని మీరు చూశారా?"

"సారీ సార్! చూశాను గానీ- అంత పరిశీలనగా చూడలేదు" సెక్రటరీ ఒకింత నొచ్చుకుంటున్నట్లుగా అన్నాడు.

"ముందా ప్రాంతాన్ని చూద్దాం పదండి" అంటూ బయటకు నడిచాడు రాఘవేంద్ర నాయుడు.

Right on the bull's eye. Raghavendra Naidu 's life should be required reading in every Indian Company and in every business school. I should give a copy of his biography to each member of my family, Motivating people to be the transcends Cultury. Must reading for anyone who wants to learn how to make a company perform at the cutting edge of excellence.

వాస్తవాలకు దూరంగా ప్రాక్టికాలిటీకి అందనంత ఎత్తుల్లో, నిజజీవితపు పరమపద సోపాన పటంపై విజయాన్ని అందించలేని కామర్స్, బి.కామ్., ఎమ్.కామ్., ఎం.బి.ఏ.,

లాంటి చదువులు నేర్పేది ఏమిటి? సింగల్ ఎంట్రీ, డబుల్ ఎంట్రీలు, లెడ్జర్స్‌లో ఎలా ఎంటర్ చెయ్యాలనేగా? ఎప్పటి విద్యా విధానం? మెకాలే ఎప్పుడో కాలగతిలో కలిసి పోయాడు. ఏ కాలంలో సిలబస్ తయారుచేశాడో? ఎవరికీ పట్టదేమో!

జె.ఆర్. డీ., రస్సీమోడీ, జి.డి.బిర్లా., హెన్రీఫోర్డ్, గియోవానీ  ఆగ్నెల్లీ, కాన్రాడ్ హిల్టన్, రాక్ ఫెల్లర్, గళధారీ బ్రదర్స్, సర్ జాన్ హార్వే జోన్స్, రాబర్ట్ ఏండర్సన్, అకిమోమోరిటా, మసారు ఇబుకా జీవితాల్ని గ్రంథస్థం చేసి వాటినే సిలబస్‌గా ఎందుకు మార్చరు? ఆ ..... ఎవడికి పట్టింది?

ఎలక్షన్స్, రిగ్గింగ్, బాంబింగ్ .....

గెలవటాలు, మెజారిటీ ఆఫ్ ఓట్స్ .....

ఆ పైన పదువులు, ప్రజాదనాన్ని పంచుకోవటాలు, వెధవలు. ఇండియన్ పొలిటీషియన్స్ ఉత్తవెధవాయిలు, పెద్ద బడుద్దాయిలు. ఇందులో సందేహం లేనేలేదు.

వారి వారి వ్య క్తిగత సంపద సామ్రాజ్యాల్ని విస్తరించుకోవటంతోనే వారి కాలమంతా వినియోగమయిపోతుంటే ..... దేశాన్ని, దేశప్రజల్ని, యువతని బాగుచేసే తీరిక, శ్రద్ధవారికెక్కడుంది?

అయినా సిగ్గు, ఎగ్గులేని ప్రజలు ఎలక్షన్స్ అనగానే పనులు మానుకొని, బారులు తీరి ఓట్లేస్తారు ఛీ ..... ఛీ .....

కేవలం ఐదో తరగతి వరకే చదువుకోగలిగిన రాఘవేంద్ర నాయుడు - ఎగ్రికల్చర్ బ్యాగ్రౌండ్ మాత్రమే వున్న రాఘవేంద్ర నాయుడు ఇరవై లక్షల నష్టాన్ని రెండు కోట్ల లాభంగా మార్చబోతున్నారు. అదే సిలబస్‌లో ఇన్‌క్లూడ్ చేస్తే పదికి ఒక్క విద్యార్థి అయినా ఎంటర్ ప్రెన్యూర్ కాలేడా? అవుతాడు- ఖచ్చితంగా అయి తీరతాడు. కానీ శ్రద్ధ ఎవరికుంది?

ఏదో విప్లవం ఈ దేశంలో రావాలి- వచ్చి తీరాలి. అది సామాజికమైనదైనా, ఆర్థికమైనదైనా వచ్చి తీరాలి.

కారు ఫ్రంట్ సీట్లో కూర్చున్న ఫైనాన్స్ సెక్రటరీ మదిలో మెదిలే ఆలోచనలివి.

కొద్ది సేపటికి కారు మధువన్ బార్ ముందు ఆగింది.

అప్పటికే రాఘవేంద్ర నాయుడు సిబ్బంది అక్కడ వుంది. ఒకరు గార్డ్‌లా కాపలా కాస్తూ కనిపించాడు.

ఛైర్‌మెన్ కారుని చూస్తూనే వాళ్ళు అలర్ట్ అయిపోయారు. రాఘవేంద్ర నాయుడు  కారు దిగి పరిసరాల్ని పరిశీలనగా గమనించాడు.

"ఫర్వాలేదు- ఒక మాదిరి సెంటరే. వ్వూ ..... " రాఘవేంద్ర నాయుడు స్వగతంలో అనుకున్నాడు.

అ తర్వాత చకచకా ఆ ప్రాంతమంతటినీ సుడిగాలిలా చుట్టివేసాడు.

"ఈ ప్రాంతానికున్న విలువను ఎన్ని రెట్లు పెంచితే - మన స్థలానికంత లాభం వస్తుందన్నమాట. అంతే గదా?" రాఘవేంద్ర నాయుడు నెమ్మదిగా అంటోంటే ఫైనాన్స్ తికమక పడిపోయాడు.

ఓవర్ నైట్‌లో అయ్యే పనికాదది.

క్రాఫోర్డ్ సెంటర్ రాఘవేంద్ర నాయుడు లాంటి జీనియస్ దృష్టిలో పడి ఆ నగరం మొత్తంలోకే అతి విలువైన వ్యాపార కేంద్రంగా మారబోతున్నదనే విషయం ఫైనాన్స్ సెక్రటరీ నాన్ క్రియేటివ్- ఎకడమిక్ బ్రెయిన్‌కి అందటం చాలా కష్టం.

"అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఆఫీసుకి పోనివ్వు" అన్నాడు రాఘవేంద్ర నాయుడు గంభీరంగా. ఆయన కనురెప్పల వెనుక కదిలే కల నిజరూపం ధరించబోతోంది.

* * * *

'అందమైన ప్రకృతికి వెండి పట్టీలు, బంగారపు వడ్డాణంతో ముస్తాబు చేసినట్లుగా ఉందా క్షణంలో మహతి.

తన ఫ్రెండ్స్‌తో కూర్చొని ఏదో పిచ్చాపాటి.

" మధుకర్ అలాగే మధ్యలో అర్థాంతరంగా వచ్చేశాడు- నువ్వు అలాగే వచ్చేసావు. ఏమయింది మీకు? వాళ్ళెంతగా బాధపడతారో?" ఒక యువతి అంది మహతిని ఉద్దేశించి.

మహతి సమాధానమివ్వలేదు.

"పొగరు, అహంభావం, ఆస్తీ, అభిజాత్యం ఉన్న ఒక యువకుడ్ని రెచ్చగొడితే నష్టం ఏ రూపంలో, ఎలా కబళించుకుపోతుందో నీకు తెలీదనుకోను. దేన్నీ తెగేదాక లాగవద్దు" అని ఒకరన్నారు.

కాలేజీ క్యాంపస్ అంతా హడావిడిగా ఉంది.

క్లాసులకు వెళ్ళే వాళ్ళు. క్లాసులయి పోయి వస్తూ, గూట్లోంచి ఎగిరివచ్చే పక్షుల్లాంటి రంగు రంగుల సీతాకోక చిలుకల్లా భ్రమింపజేసే స్టూడెంట్స్, నవ్వుతూ, త్రుళ్ళుతూ, రకరకాలుగా స్పందిస్తూ కేంపస్‌కి వింత శోభను తెస్తున్నారు.

ఓ మూలంగా పున్నాగు చెట్టుక్రింద ఉన్న సిమెంట్ బెంచీమీద కూర్చున మహతి, ఆమె ఫ్రెండ్స్ ఒకింత ఉద్విగ్న క్షణాల్ని పంచుకుంటున్నారు.

అప్పటికే మహతి మధువన్ బార్‌ని మధుకర్ మత్తులో పడి ముప్ఫయ్ లక్షలకు కొన్నాడనే వార్త కాలేజ్ అంతా గుప్పుమంది.

"ఏం చేస్తాడంటావ్?" పొగరుగా అంది మహతి.

" ఏదైనా చేయగలడేమో!"

మహతి గలగలా నవ్వింది. మంచిముత్యాల్లాంటి తెల్లని ఆమె పలువరస వెన్నెల్ని వెదజల్లింది.

సరీగ్గా ఇదే సమయంలో మరోచోట.

మధుకర్ తన మిత్రబృందంతో వేడి వేడి చర్చల్లో మునిగివున్నాడు.

"నిన్ను పిచ్చివాడ్ని, వెర్రిబాగులవాడ్ని చేసి, పదిలక్షల ఖరీదు కూడా చేయని బార్‌ని ముప్పై లక్షలకు కొనిపించింది. ఏదో ఆవేశంలో నువ్వే దాన్ని కొన్నాననుకుంటున్నావేమో. కాదు. అది మహతి తండ్రి వ్యాపారమైనా, ఆమె పేరు మీదే వుంది. డ్రామా అంతా ఆడింది మహతే అని నాకు తెలిసింది. ఎలా అంటావేమో. అందులో పనిచేసే మేనేజర్ ఇల్లు మా ఇంటి ప్రక్కనే వుంది. అతనికి పది లక్షలు వచ్చాయట.  ఆ ఆనందాన్ని పట్టలేక క్రితం రాత్రి బాగా తాగి వచ్చి మా ఇంటి తలుపు కొట్టాడు. అందుకు మా నాన్న గారు కోపగించుకున్నారు. అందుకతను రెచ్చిపోయి, "నిన్నూ, నీ ఇంటినీ కొనవతల పడేస్తాను. ఇప్పుడు నా దగ్గర పది లక్షలున్నాయి. జాగ్రత్త" అని అరుస్తూ తన ఇంటికి వెళ్ళి పోయాడు.

నాకు ఆశ్చర్యం, అనుమానం కలిగి ఆరా తీస్తే తెలిసింది.

అనుకోకుండా మాటా, మాటా పెరిగి పౌరుషం ప్రదర్శించుకోటానికి, పరువు దక్కించుకోవటానికి కొంటే ఫర్వాలేదు. కాని నిన్ను వెర్రి బాగులవాడ్ని చేయటానికే ఆ ప్రయత్నం జరిగిందని, దానివెనుక మహతి వుందని తెలిశాక శతృత్వం ఎలా నెలకొంది?"

మధుకర్ ఫ్రెండ్ ఒకరు కేజువల్‌గా అన్నా, ఆ మాటలు మధుకర్ లో పెను తుఫానునే రేపాయి.

ఏ క్షణంలోనైనా బ్రద్దలవ్వబోయే అగ్నిపర్వతంలా అయిపోయాడు మధుకర్ .

అతని రక్తనాళాలు ఉద్రక్తతను భరించలేని టెన్షన్‌కి గురయ్యాయి.

పౌరుషం, కోపం, పగ, ప్రతీకారాలతో అతనూగి పోతున్నాడు.

బార్‌ని ముప్పై లక్షలకు కొన్నప్పుడు తనలోని అహం సంతృప్తిపడింది-తనలోని అభిజాత్యం శాంతించింది. అదేదో పెద్ద విజయమన్నట్లుగా తను గర్వపడ్డాడు.

తీరా ఇప్పుడిది- తనని మరో షాక్‌కి గురి చేసింది.

తెర వెనుక ఉండి కథ నడిపింది- తనెంతగానో ప్రేమిస్తున్న మహతి అని తెలీగానే ఆమెను కోపగించుకోవాలో- తనని అవమానించినందుకు ప్రతీకారం తీర్చుకోవాలో తెలీక ఒక విచిత్రమైన సంక్లిష్ట భావోద్వేగానికి గురయ్యాడు.

ఏమిటి తను చేసిన తప్పు?

ఏమిటి తను చేసిన ద్రోహం?

ఎందుకిలా చేసింది? ఎందుకిలా చేస్తోంది? మధ్యలో ఎవరైనా గిట్టని వాళ్ళు తన గురించేమన్నా చెడుగా చెప్పారా? అంత త్వరగా నమ్మేది కాదే .....

అయినా ఆమెకు తెలీకుండా తను చేసిన చెడ్డ పనేముంది?

తను ఇరవై లక్షలు నష్టపోయినందుకు బాధగా లేదు.

తను తాగి పౌరుషానికి పోయి బార్‌ని కొన్నందుకు బాధలేదు. కాని తనని అందుకు పురికొల్పి, ఆ దిశకి డ్రైవ్ చేసినందుకు  అవమానంగా వుంది.

కొద్ది క్షణాల మీమాంస తరువాత మధుకర్ విసురుగా లేచాడు.

ప్రక్కనున్న వాళ్ళు రియాక్ట్ అయ్యేలోపే మహతి ఉన్న దిశకేసి వేగంగా దూసుకుపోయాడు.

* * * *

“అరెరె ..... మీరెందుకు సార్ వచ్చారు? కబురు చేస్తే నేనే వచ్చేవాడిని గదా?” అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌మెన్ రాఘవేంద్ర నాయుడ్ని చూసి లేచి నించుని అన్నాడు.

రాఘవేంద్ర నాయుడు మృదువుగా నవ్వి- కూర్చోమన్నట్లుగా సంజ్ఞచేసి తనూ కూర్చున్నాడు.

“చెప్పండి సర్! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?” గౌరవాభిమానాల్ని వ్యక్తం చేస్తూ అన్నాడు ఛైర్‌మెన్.

“క్రాఫోర్డ్ సెంటర్ డెవలప్‌మెంట్ మీద ఏదయినా ప్రాజెక్ట్ మీ దృష్టిలో వుందా?” రాఘువేంద్ర నాయుడు సూటిగా విషయంలోకి వచ్చాడు.

“అదంత పెద్దగా డెవలప్ అయ్యే ఏరియా కాదని మా స్టాఫ్ అభిప్రాయం సార్” ఛైర్‌మెన్ మెల్లిగా అన్నాడు.

“మనం తలుచుకుంటే కాదా?”

“ఎంతమాట! కాదని ఎవరంటారు?”

“మరి డెవలప్ చేద్దామా?”

“ష్యూర్!ష్యూర్! బట్ ..... ”

“ఫర్వాలేదు చెప్పండి.”

“గవర్నమెంట్ పాలసీని దృష్టిలో ఉంచుకోవాలి. చట్టపరమైన నిబంధనల్ని పాటిస్తూ డెవలప్‌మెంట్ చుసుకోవాలి. ఫండ్స్ ప్రాబ్లమ్ కూడా వుంది.”

“మీ పెట్టుబడి పైసా లేకుండా మీ సంస్థకు నెలకు కొన్ని లక్షలు లాభం వచ్చే పథకం మొకటి నేను చెబుతాను. ఇష్టపడతారా?”

“అప్పుడు రూల్స్‌ని ప్రక్కన పెట్టమన్నా పెడతాను. లిటరల్‌గా చెప్పాలంటే మా సిబ్బందికి మేం  జీతాలివ్వలేని స్థితిలో వున్నాం. పెట్టుబడి లేకుండా నెల నెలా ఆదాయం వస్తుందంటే ఎవరయినా కాదనగలరా?”

“అయితే పదండి. మీ సర్వేయర్‌ని పిలిపించండి- ఆ ప్రాంతపు ఆర్.డి.ఓని పిలిపించండి” అన్నాడు రాఘువేంద్ర నాయుడు వెళ్ళేందుకు ఉద్యుక్తుడవుతూ.

చైర్మెన్‌ని క్షణకాలంలో సవాలక్ష అనుమానాలు, ఆలోచనలు చుట్టుముట్టాయి.

అలా అని రాఘవేంద్ర నాయుడ్ని అడిగే ధైర్యం చేయలేక పోయాడు.

ఇంటర్‌కమ్ నొక్కి సర్వేయర్‌ని, ఆర్.డి.ఓ ని జరూరుగా పిలిపించమని ఆజ్ఞలు జారీ చేశాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మెన్.

*    *    *    *

"అవును! నేనే కావాలని నిన్ను రెచ్చగొట్టించి మా బార్‌ని ముప్ఫై లక్షలకు నీతో కొనిపించాను. అందులో నీ అహం, వెర్రిబాగులతనం ఎంతున్నాయో గమనించావా?" మహతి కావాలనే పెంకిగా సమాధానమిచ్చింది మధుకర్‌కి.

అతనికేం చేయాలో క్షణకాలంపాటు పాలుపోలేదు. చుట్టుప్రక్కలున్న స్టూడెంట్స్ ఊపిరి బిగబట్టి, కనురెప్ప వేయటం మర్చిపోయి, శిలా ప్రతిమల్లా బిగుసుకుపోయి చుస్తున్నారు.